APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

24-06-2026
బుధవారం
హైదరాబాద్
సంపుటి: 17 I సంచిక: 240
పేజీలు: 04 I వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



## పల్లెల ప్రగతికి 'టీమ్ వర్క్' మంత్రం

2




# మెట్రోపై చర్చలు ఫలప్రదం

### ఫేజ్1 వాల్యుయేషన్, ఫేజ్2 విస్తరణకు కన్సల్టెంట్ నియామకం

### కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ

### కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్, కిషన్ రెడ్డి భేటీ

- హైదరాబాద్ మెట్రో రెండో దశ, తెలంగాణలో కీలక ప్రాజెక్టులపై చర్చ
- మెట్రో ఫేజ్-2 విస్తరణకు ఐఆర్ఎఫ్‌సీ నుంచి రుణ సదుపాయంపై చర్చించినట్లు సమాచారం
- రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి చేస్తా
- కేంద్రమంత్రులతో సంయుక్త సమావేశాలు అనుకూల వాతావరణంలో జరిగాయి
- ఎక్స్ వేదికగా తెలిపిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**

హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్ I వాల్యుయేషన్, ఫేజ్ I స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, మెట్రో ఫేజ్ II విస్తరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్రమంత్రులు, సీఎం ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ఎస్బీఐ క్యాప్స్‌ను ఎంపిక చేశారు.

**కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ..**

మెట్రో ఫేజ్ I వాల్యుయేషన్, ఫేజ్ II విస్తరణ, ఇతర అంశాలపై ఎస్బీఐ క్యాప్స్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టనుంది. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు.

**మెట్రో ఫేజ్-II విస్తరణపై చర్చ..**

హైదరాబాద్ మెట్రో ఫేజ్ I స్వాధీనం, ఫేజ్ 2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం సాయంత్రం రైల్వే శాఖ..

మిగతా 2లో...



## రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై సీఎం కన్ను

- ఎల్అండ్‌టీ అధికారులను బ్లాక్ మెయిల్ చేసి వారిని రాష్ట్రం నుంచి తన్ని తరిమేశారు
- ఎల్అండ్‌టీ రూ.14 వేల కోట్ల అప్పును రాష్ట్ర ప్రజల మీద రేవంత్‌రెడ్డి రుద్దుతున్నారు
- మెట్రోపై ప్రేమ ఉన్నట్లు చేస్తున్న సీఎం ప్రయత్నం వెనుక భారీ కుంభకోణం ఉంది
- లక్డీకాపూల్ నుంచి మెట్రో పటాన్‌చెరువు వరకు ప్రతిపాదిస్తే ఎందుకు ఆమోదం తెలపలేదు?
- మూసీ ప్రాజెక్టు పేరుతో అక్రమాలకు తెరలేపారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2



2

## ప్రతి పదవికీ వన్నె తెచ్చిన వ్యక్తి

- రాజకీయాల్లోకి రావాలనుకునేవారు వెంకయ్య ఉపన్యాసాలు వినాలి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ప్రజా జీవితంలో విలువలతో కూడిన ప్రయాణం సాగించిన ఘనత ఆయనదే
- కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ
- సమయ పాలన, నిబద్ధతలో ఆయన రాజీపడరు:బండారు దత్తాత్రేయ
- హైదరాబాద్‌లో 'వెంకయ్య నాయకుడు' పుస్తకావిష్కరణ

## రెండో విడత 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం

- మమ్ముట్టికి పద్మభూషణ్.. మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌కు పద్మశ్రీ
- అవార్డులను ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము











2



### అమెరికా పౌరసత్వం

## మరింత ఖరీదు..!

- ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని ప్రతిపాదన
- ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ

2

విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..



## రెండో విడత 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 'పద్మ' అవార్డుల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం సాయంత్రం ఈ అవార్డులను ప్రదానం చేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి మంగళవారం పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

### హర్మ్యూజ్‌ను దాటి..

## భారత్ వైపు 11 నౌకలు

**నేషనల్ బ్యూరో :** అమెరికా ఇరాన్‌లు శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత హర్మ్యూజ్ జలసంధిలో పరిస్థితులు మెరుగుపడుతున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలో భారత్ జెండాలున్న 11 నౌకలు హర్మ్యూజ్‌ను దాటినట్లు భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. పశ్చిమాసియాలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా చమురు దిగుమతి చేసుకుంటామన్నారు. ''ఇప్పటివరకు భారత జెండాలున్న పది నౌకలు ఇంకా పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయి. అదనంగా మరో రెండు నౌకలు ఇటీవలే అక్కడకు చేరుకున్నాయి. అమెరికాఇరాన్ ఒప్పందం జరిగినప్పటి నుంచి 11 భారతీయ నౌకలు హర్మ్యూజ్‌ను దాటాయి. ఒక్కోదాంట్లో 2.85లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉన్న మూడు భారత జెండాలున్న నౌకలు, విదేశీ జెండా ఉన్న ఓ ఎల్‌పీజీ నౌక, విదేశీ జెండా ఉన్న మరో ముడి చమురు ట్యాంకర్, ఆరు విదేశీ జెండాలున్న ఎరువులు సరఫరా చేస్తున్న భారీ నౌకలు ఉన్నాయి. మిగిలిన భారత జెండాలున్న నౌకలు త్వరలోనే జలసంధిని దాటుతాయని అంచనా వేస్తున్నాం'' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

**ఇరాన్ చమురు కొనుగోలు..!**

ఇరాన్ నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందా? అన్న ప్రశ్నకు జయస్వాల్ బదులిస్తూ.. 140 కోట్ల పౌరులకు తక్కువ ధరలో ఇంధనం అందించడమే ప్రభుత్వ విధానమని చెప్పారు. అయితే, రష్యా చమురు కొనుగోలుపై అమెరికా విధించిన ఆంక్షల గడువు వారం క్రితం ముగియడం.. ఇరాన్ సంస్థల నుంచి కొనుగోలు చేసేందుకు భారతీయ కంపెనీలకు అవకాశం లభించినట్లయ్యిందన్నారు.

## మెట్రోపై చర్చలు ఫలప్రదం

(3వ పేజీ తరువాయి)

మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. మంగళవారం కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, అశ్వనీ వైష్ణవ్‌లతో కలిసి ఖట్టర్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి, దాదాపు అరగంట పాటు పలు అంశాలపై చర్చించారు.హైదరాబాద్ నగరంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, మెట్రో రెండో దశ గురించి చర్చించినట్లు తెలుస్తోంది. సోమవారం రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డిలు కలిసిన సమయంలో సానుకూల స్పందన వచ్చింది. సోమ, మంగళవారాలు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో మకాం వేసి కేంద్రమంత్రులతో వరుసగా సమావేశమవుతూ రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోరారు. . కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసిన సీఎం ప్రధానంగా మెట్రో విస్తరణ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రుణ సదుపాయం, హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థ విస్తరణ, ఇతర అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.

**రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి చేస్తాను..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయమని కోరుతూ తనకు రెండుసార్లు లేఖ రాశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్స్ వేదికగా తెలిపారు. గత రెండు రోజులుగా తాను ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశానన్నారు. సోమవారం అశ్వినీ వైష్ణవ్‌తో జరిగిన సమావేశం, కేంద్ర మంత్రి ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌లతో జరిగిన సంయుక్త సమావేశం అనుకూల వాతావరణంలో జరిగాయని తెలిపారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా, తాను ఎల్లప్పుడూ తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రతి గింజను సేకరించాం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం విధించిన టార్గెట్‌ను మించి వరి కొనుగోలు తెలంగాణ ప్రభుత్వం చేపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత మూడు సీజన్లలో 69.50 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు వరి కొనుగోలు చేశామని, దీంతో రాష్ట్రంపై రూ.16,446 కోట్ల ఎంఎస్‌పీ భారం పడిందన్నారు. ఎండలు, హమాలీల కొరత, నిల్వ సమస్యలు, అకాల వర్షాల మధ్య కూడా సేకరించామని, రైతులకు ఎలాంటి నష్టం లేకుండా ప్రతి గింజను కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. మంగళవారం ఢిల్లీకి వెళ్లిన ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ధాన్యం సేకరణపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన పేర్కొంటూ రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో జరిగిన వరి కొనుగోళ్లతో కేంద్రం నిర్దేశించిన సేకరణ, సీఎంఆర్ సరఫరా గడువులను పొడిగించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి కనీస మద్దతు ధరకు ఒక్క గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేసినట్లు తెలిపారు. దేశంలోనే అత్యధికంగా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించిందని, కొనుగోలు ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ కలిపి 202526 మార్కెటింగ్ సీజన్‌లో 152 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా వరి సేకరణ జరిగి చారిత్రాత్మక రికార్డు నమోదైంది. రాష్ట్రం పంపిన ఉత్పత్తి అంచనాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వరి సేకరణ లక్ష్యాలను తక్కువగా నిర్ధారించడంతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందన్నారు. రబీలో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ అంచనాలు సమర్పించినప్పటికీ, కేంద్రం కేవలం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (51.47 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానం) మాత్రమే లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. రబీ 5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, ఖరీఫ్ 202526కు సంబంధించి 14.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేంద్ర పూల్‌కు సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. నిల్వ స్థలాల కొరత, ఒకేసారి పలు సీజన్ల కొనుగోళ్లు కొనసాగడం, మిల్లింగ్ సామర్థ్యాలపై ఒత్తిడి వంటి కారణాలతో గడువులు పొడిగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రబీ 202425 సీఎంఆర్ సరఫరా గడువును మరో 60 రోజులు, ఖరీఫ్ 202526 గడువును 120 రోజులు పొడిగించాలని కోరారు. రబీ సేకరణ లక్ష్యాన్ని 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నుంచి 54.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి పెంచాలని, ఇప్పటికే సేకరించిన 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానమైన పరిమాణాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

# పల్లెల ప్రగతికి 'టీమ్ వర్క్' మంత్రం



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** విడివిడిగా పని చేస్తే ఫలితాలు రావు, జిల్లా స్థాయిలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు ఒకే టీమ్‌గా పనిచేయాలని మంత్రి సీతక్క సూచించారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని, ప్రతి గ్రామానికి అవసరాలు, వనరులు, సమస్యలను గుర్తించి వాటి ఆధారంగా కార్యాచరణ అమలు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్లు నిర్మించడం మాత్రమే కాదని, గ్రామాల్లో నివసించే ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే అసలు అభివృద్ధి అని పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మంగళవారం గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాల అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలు, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ, సెర్ప్, ఉపాధి హామీ పథకం తదితర విభాగాల అధికారులతో మంత్రి సీతక్క సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్యా దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు ఏడు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో శాఖల వారీగా పనుల పురోగతి, భవిష్యత్తు లక్ష్యాలపై మంత్రి సమీక్షించారు.

**అన్ని గ్రామాలను గంగదేవిపల్లిలా చేయొచ్చు..**

గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల పరిధిలో సుమారు 1.35 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఏటా రూ.34 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చవుతున్నాయని మంత్రి సీతక్క వివరించారు. ఇంత సిబ్బంది, నిధులు ఉన్నా గ్రామాల అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. తెలంగాణలోని గ్రామాల్లో అపారమైన సహజ, మానవ వనరులు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగిస్తే గంగదేవిపల్లి వంటి ఆదర్శ గ్రామాలను రాష్ట్రవ్యాప్తంగా తయారు చేయవచ్చని స్పష్టం చేశారు. గ్రామాలకు వచ్చే ప్రతి రూపాయి ప్రజల ప్రయోజనాలకే ఖర్చు కావాలన్నారు. కొన్నిచోట్ల గ్రామ సభలు నిర్వహించకుండా నిధులు ఖర్చు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులకు వార్నింగ్ ఇచ్చారు.

**జల సంరక్షణ ముఖ్యం..**

గ్రామ స్థాయిలో భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'జలసిరి' అవగాహన పోస్టర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకొని జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటలు, బావులు, వాగులను పరిరక్షించడం కీలకమన్నారు. పాత బావులను గుర్తించి పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి ఊరిలో ఊటకుంటలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు సహా ప్రతి ఇంటికి నిరంతరాయంగా రక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

**కేంద్రం సహకరించాలి..**

ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిర్మిస్తున్న రహదారులకు కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతుల సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. పట్టణాల్లో స్కైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తుంటే అటవీ గ్రామాల్లో కనీసం బీటీ రోడ్డు వేయడానికి అనుమతులు రావడం లేదన్నారు. కేంద్రం నిధులు మంజూరు చేసిన తర్వాత కూడా అనుమతుల పేరుతో అడ్డంకులు సృష్టించడం వల్ల ఆదివాసీ గిరిజన గ్రామాలు ఇంకా వెనకబాటులోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరగనున్న సమావేశంలో ఈ సమస్యలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు.

**కష్టాలు మనకు తెలుసు..**

'మనందరిదీ గ్రామీణ నేపథ్యమే. గ్రామీణ ప్రజల కష్టాలు మనకు తెలుసు. కాబట్టి గ్రామాల్లో సమస్యలు తలెత్తకముందే పరిష్కారాలు చూపాలి. తెలంగాణ గ్రామాలను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే బాధ్యత మనందరిది' అని అధికారులకు మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంకు లింకేజీల పెంపు, మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సెర్ప్ అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళల ఆర్థిక సాధికారత పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

## రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై సీఎం కన్ను

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇద్దరూ కలిసి హైదరాబాద్ మెట్రో అంశంలో డ్రామాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రేవంత్ రెడ్డి కేంద్రాన్ని ఏదో అడిగినట్లు.. కేంద్రం నుంచి కిషన్‌రెడ్డి ఏదో తీసుకొచ్చినట్లు ఢిల్లీలో మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని అన్నారు. హైదరాబాద్‌లో అడ్డగోలుగా విమర్శలు చేసుకొని, ఢిల్లీలో కలిసినట్లు నాటకాలు ఆడుతూ కేవలం ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎయిర్ పోర్ట్ మెట్రో రద్దు చేసిన రేవంత్‌ను, మెట్రో విస్తరణకు అనుమతి ఇవ్వని కిషన్‌రెడ్డిని ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. హైదరాబాద్ మెట్రో పైన ఉన్న 250 ఎకరాల భూములను తన సొంత అన్నదమ్ములకు, బావమరిదికి, కుటుంబ సభ్యులకు కట్టబెట్టేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారన్నారు.మెట్రో దగ్గర ఉన్న రూ.30 వేల కోట్ల విలువైన ఆస్తులపై కన్నేసి, ఎల్అండ్‌టీ అధికారులను బ్లాక్ మెయిల్ చేసి వారిని రాష్ట్రం నుంచి తన్ని తరిమేశారన్నారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం మెట్రో వేల కోట్ల ఆస్తుల కోసం ప్రైవేట్ సంస్థ అయిన ఎల్అండ్‌టీ రూ.14 వేల కోట్ల అప్పును రాష్ట్ర ప్రజల మీద రేవంత్‌రెడ్డి రుద్దుతున్నారన్నారు. మెట్రోపై ప్రేమ ఉన్నట్లు చేస్తున్న సీఎం ప్రయత్నం వెనుక భారీ కుంభకోణం ఉన్నదని ఆరోపించారు. కిషన్‌రెడ్డికి, కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణపై చిత్తశుద్ధి ఉంటే, ఇప్పుడు చేస్తున్నది డ్రామా కాకుంటే గత ప్రభుత్వం ప్రతిపాదించిన లక్డీకాపూల్ నుంచి మెట్రో పటాన్‌చెరువు వరకు ప్రతిపాదిస్తే ఎందుకు ఆమోదం తెలపలేదన్నారు. అత్యధిక జన సాంద్రత కలిగిన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి ఎయిర్ పోర్ట్ వరకు ఎలాంటి భూసేకరణ లేకుండా మెట్రో రైలు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, రేవంత్‌రెడ్డి దానిని రద్దు చేశారన్నారు. హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రాజెక్టు మరోసారి పట్టాలు ఎక్కాలంటే కచ్చితంగా కేసీఆర్ తిరిగి రావాల్సిందేనని అన్నారు.

**మూసీ ప్రాజెక్టు పేరుతో అక్రమాలు..**

రేవంత్‌రెడ్డికి తుగ్లక్ ఆదర్శం కాబట్టే, అడ్డగోలుగా హైదరాబాద్ నగరంలో లక్షల మంది ఇండ్లను కూలగొట్టి, మూసీ ప్రాజెక్టు పేరుతో అక్రమాలకు తెరలేపారని కేటీఆర్ అన్నారు. లక్షన్నర కోట్లతో మూసీ పనులు చేసేందుకు డబ్బులు ఉంటాయి కానీ, ఇచ్చిన హామీలను అమలు చేయడానికి మాత్రం డబ్బులు ఉండవని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తల కష్టంతో గెలిచిన షేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తన అవినీతి, అక్రమాలను కోసం, స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లోకి మారారన్నారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ కాలంలో ఒక్క షేరిలింగంపల్లి నియోజకవర్గానికి రూ.9,500 కోట్లతో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతో ఒక ప్రగతి నివేదికను విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రెండున్నరేళ్లలో ఎన్ని డబ్బులు నియోజకవర్గానికి తెచ్చారో ఎమ్మెల్యే గాంధీ చెప్పాలన్నారు. షేరిలింగంపల్లిలో మరోసారి గులాబీ జెండా ఎగరాలంటే కార్యకర్తలంతా కలిసికట్టుగా కదంతొక్కాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతోపాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్‌పై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ మళ్లీ ఎప్పుడు సీఎం పదవీ బాధ్యతలు స్వీకరిస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు.

## ఏసీబీ అదుపులో నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేసింది. అక్రమాలకు పాల్పడి ఆస్తులు సంపాదించినట్లు మల్లారెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని మచ్చబొల్లారం, నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లోని మల్లారెడ్డి నివాసాలతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తుల వ్యవహారంలో హైదరాబాద్ మచ్చబొల్లారం, నిజామాబాద్ ప్రగతినగర్‌లోని ఆయన నివాసాలతో పాటు సూపరింటెండెంట్ కార్యాలయం, ఆయన బంధువుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. గత ఆరేళ్లుగా మల్లారెడ్డి నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఏసీబీ అధికారులు మల్లారెడ్డిపై దృష్టిసారించారు.ఏసీబీ తనిఖీల్లో మల్లారెడ్డికి చెందిన పలు ఆస్తులను గుర్తించారు. 4 ఇళ్లు, ఒక వాణిజ్య భవనం, 8 ఖాళీ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. ఆయన వద్ద సుమారు రూ.3.31లక్షల నగదు, రూ.50లక్షల బ్యాంకు నిల్వలు, మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై 3 బ్యాంకు లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా వీటిని త్వరలో తెరవనున్నారు. సోదాల్లో గుర్తించిన మొత్తం ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.3కోట్లుగా అంచనా వేశారు. మార్కెట్ విలువ ప్రకారం అనేక రెట్లు అధికంగా ఉండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ప్రగతి నగరంలోని ఆయన నివాసంలో కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులు.. మల్లారెడ్డిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తరలించారు. మల్లారెడ్డిని బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

## అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు..!

**నేషనల్ బ్యూరో :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికొస్తే.. 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమల్లోకి వస్తే.. 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే.. దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే.. ఖర్చుల మోత మోగనుంది. ఆ రుసుము 830 డాలర్ల నుంచి 1475 డాలర్లకు అంటే 645 డాలర్ల మేర పెరగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం.. దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డీహెచ్ఎస్ ప్రతిపాదించింది. 400 శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్‌డ్ ఫీజు ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు.. తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రతి పదవికీ వన్నె తెచ్చిన వ్యక్తి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** స్నేహానికి నిలువెత్తు నిదర్శనం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సమయ పాలనలో ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. హైదరాబాద్‌లో 'వెంకయ్య నాయకుడు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్, డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రతి పదవికీ వన్నె తెచ్చిన వ్యక్తి : కిషన్‌రెడ్డి

''చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చిన వ్యక్తి వెంకయ్యనాయుడు. అసెంబ్లీలో ఆయన చేసిన ఉపన్యాసాలు అందరికీ ఆదర్శం. తెలుగు రాష్ట్రాల్లో నేతలు గౌరవం తగ్గించే విధంగా మాట్లాడుతున్నారు. రాజకీయాల్లోకి రావాలనుకునే వారు అసెంబ్లీలోని వెంకయ్య ఉపన్యాసాలు వినాలి. రైతులు, గ్రామాలు అంటే ఆయనకు చాలా ఇష్టం. గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు తీసుకుని గ్రామాలను అభివృద్ధి చేశారు''

సమయ పాలన, నిబద్ధతలో ఆయన రాజీపడరు:బండారు దత్తాత్రేయ

''వెంకయ్యనాయుడు అలుపెరగని నాయకుడు. సమయ పాలన, నిబద్ధతలో ఆయన రాజీపడరు. ఎవరు ఫోన్ చేసినా తిరిగి కాల్ చేసి మాట్లాడే నాయకుడాయన. ఈర్ష్య, ద్వేషం లేని వ్యక్తి. ప్రతి వేదికపై తెలుగు భాష గురించి మాట్లాడతారు. సమాజంలోనే ఎక్కువగా ఆయన గడుపుతారు. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగే నాయకుడు వెంకయ్య. ఆర్టికల్ 370 బిల్లు సభలో ప్రవేశ పెట్టినప్పుడు దాన్ని పాస్ చేయించిన ఘనత ఆయనదే''.

ప్రజా జీవితంలో విలువలతో కూడిన ప్రయాణం సాగించిన ఘనత ఆయనదే: భూపతిరాజు శ్రీనివాసవర్మ

''కుగ్రామంలో పుట్టి, దేశంలోనే రెండో అత్యున్నత పదవి ఉపరాష్ట్రపతి వరకు ఎదిగిన అరుదైన వ్యక్తి వెంకయ్యనాయుడు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉంటూ.. సుదీర్ఘకాలం ప్రజా జీవితంలో విలువలతో కూడిన ప్రయాణం సాగించిన ఘనత ఆయనకే దక్కుతుంది. బాల్యంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ.. వాటన్నింటినీ అధిగమించి పట్టుదలతో చదువుకున్నారు. నేడు నేను కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నానంటే దానికి వెంకయ్యనాయుడు చూపిన చొరవ, అందించిన ప్రోత్సాహమే కారణం. దేశవ్యాప్తంగా ఎంతోమంది నిబద్ధత కలిగిన ఉత్తమ నాయకులను తయారు చేసిన గొప్ప మార్గదర్శి వెంకయ్యనాయుడు''.

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి జరిగిందంటే ఆయన చొరవే: ఏపీ మంత్రి సత్యకుమార్

''దేశంలో జరిగిన అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో వెంకయ్యనాయుడి పాత్ర ఎనలేనిది. నేడు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి జరిగిందంటే ఆయన చొరవే. వెంకయ్య బాల్యం, సాధించిన విజయాలు ఈ పుస్తకంలో అద్భుతంగా ప్రస్తావించారు. భవిష్యత్తులో పుస్తకం రాస్తే అది కచ్చితంగా ఆయన గురించే ఉంటుంది. ఏపీకి పోలవరం ప్రాజెక్టు సాకారం కావడానికి ప్రధాన కారణం వెంకయ్యనాయుడే''

వెంకయ్యనాయుడిది అసాధారణ జ్ఞాపకశక్తి: డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి

''వెంకయ్య నాయుడిది అద్భుత జీవిత ప్రస్థానం. సాధారణ విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి ఉపరాష్ట్రపతిగా అంచలంచెలుగా ఎదిగారు. క్షణం తీరిక లేకుండా కొత్త ఆలోచనలతో ముందుకెళ్లే గొప్ప వ్యక్తిత్వం ఆయన సొంతం. వెంకయ్యనాయుడిది అసాధారణ జ్ఞాపకశక్తి.. పాతికేళ్ల కిందటి పరిచయాన్ని కూడా ఇట్టే గుర్తుపడతారు. రామేశ్వరంలో అబ్దుల్ కలాం స్మారక నిర్మాణంలో ఆయన కీలకపాత్ర పోషించారు''.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ జన సమితి, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొ.కోదండరాం టి.జె.ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రొ. కోదండరాం ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగించే అవకాశం ఉన్న ఏ చర్యనైనా ప్రజాస్వామ్య శక్తులు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయడం సాధ్యం కాదని, కనీసం ఒక సంవత్సరం పాటు ఈ ప్రక్రియను కొనసాగిస్తేనే ఓటర్లకు తగిన అవకాశం లభిస్తుందని అన్నారు. గతంలో ఎస్ఐఆర్ నిర్వహించిన రాష్ట్రాల్లో తగిన సమయం లేకపోవడం వల్ల పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయిన పరిస్థితులు ఉన్నాయని గుర్తు చేశారు.తెలంగాణలో కూడా లక్షలాది మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున ఎన్నికల సంఘం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వివిధ కారణాలు చూపుతూ పౌరుల ఓటు హక్కును తొలగించే పరిస్థితులు తలెత్తకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ జన సమితి, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వితంతువుల పట్ల వివక్ష తగదు

**- సర్పంచ్ అందే శ్రీమతి**



**జమ్మికుంట, స్నేహిత ఎక్స్‌ప్రెస్ :** వీణవంక మండలం వల్భాపూర్ గ్రామంలో ప్రపంచ వితంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బాలవికాస ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అందే శ్రీమతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భర్తలను కోల్పోయిన మహిళల పట్ల ఇంటా, బయటా వివక్ష కొనసాగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల్లో విద్య, చైతన్యం పెంపొందితేనే ఇటువంటి దురాచారాలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రతి మహిళ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ, అనారోగ్యం లేదా రోడ్డు ప్రమాదాల కారణంగా భర్తలను కోల్పోయిన మహిళలు ఎందుకు సామాజిక శిక్షలు అనుభవించాలని ప్రశ్నించారు. పుట్టుకతో వచ్చిన హక్కులను, సంప్రదాయాల పేరుతో మహిళల నుంచి దూరం చేయడం తగదని అన్నారు. వితంతువుల పట్ల వివక్ష చూపడం నేరమని, పుట్టింటి వారైనా, అత్తింటి వారైనా తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు.అలాగే, భార్యను కోల్పోయిన పురుషులు పునర్వివాహాలు చేసుకున్నట్లే, భర్తను కోల్పోయిన మహిళలకు కూడా పునర్వివాహాలకు కుటుంబ సభ్యులు ప్రోత్సాహం అందించాలని ఆమె కోరారు.బాలవికాస సభ్యురాలు హైమావతి మాట్లాడుతూ, వితంతువుల పట్ల కొనసాగుతున్న వివక్ష, దురాచారాలను ఇకపై సహించబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు కె. సుమలత, ఎ. స్వాతి, ఆసియా తదితరులు పాల్గొనగా, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


# విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ.విమల శ్రీనివాస్ రెడ్డి**



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని హుగ్గెల్లీ గ్రామంలో రైతు వేదికలో మంగళవారం విత్తనాలు మేళ పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారిణి లావణ్యతో కలిసి ప్రారంభించిన హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి,వారు మాట్లాడుతూ..రైతులకు రెడ్అమ్, గ్రీన్రామ్,బ్లాక్రోమ్,సోయాబీన్ విత్తనాలతో పాటు నానో యూరియా,నానో డీఏపీ,కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.హుగ్గెల్లి క్లస్టర్లో రైతులకు ఉచిత మినీ కిట్లను కూడా పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏఈవో, రైతులు,మహిళా రైతులు,గ్రామస్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లాపూర్ డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని అల్లాదుర్గం ఎస్ఐ శంకర్ అన్నారు. పీఎం శ్రీ ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి నిర్మూళనపై అవగాహన కల్పించారు. యువత, విద్యార్థులు బానిసై తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని, వీటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని సూచించారు. విద్యార్థి దశ నుంచే చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

# జర్నలిస్టులపై దాడులు ఎక్కడ జరిగిన కఠిన చర్యలు తీసుకోవాలి

**ప్రెస్ క్లబ్ నాయకులు తాసిల్దార్ కు వినతిపత్రం**



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిష్పక్షపాతంగా వార్తలు రాస్తూ ప్రజల వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల పై దాడులు ఎక్కడ జరిగిన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం అల్లాదుర్గం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రఘుపతి ఆధ్వర్యంలో తాసిల్దార్ మల్లయ్యకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిజాన్ని నిర్భయంగా రాసిన మెదక్ జిల్లా నార్సింగ్ మండల మన తెలంగాణ విలేకరి రాఘవేందర్ పై దాడిని టియుడబ్ల్యూజే యూనియన్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని వారు పేర్కొన్నారు.గ్రామ పంచాయతీ స్థలంలో అక్రమంగా షెడ్లు నిర్మిస్తున్నారని వార్త ప్రచురించిన రిపోర్టర్ రాఘవేందర్ పై దాడి చేయడం హేయమైన చర్య అని వెంటనే నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు)నాయకులు వీరేందర్( సాక్షి) రమేష్ (ఆంధ్రజ్యోతి,) వెంకట్ రామ్ (నమస్తే తెలంగాణ), కృష్ణ (మన తెలంగాణ)శేఖర్ (జనం సాక్షి) నరేష్ (దిశ)రాజు (ప్రజా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పోతంగల్ మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులుగా గులాం నబీ

- మండల ఫోరాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్న ఉప సర్పంచ్లు
- మండలాభివృద్ధికి సేవలందిస్తూ,ఉప సర్పంచ్ల హక్కుల పరిరక్షణకు పాటుపడతా
- నూతనంగా అధ్యక్షులు గులాం నబీ

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్ నందు మంగళవారం మండల ఉప సర్పంచ్లు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని మండల ఫోరాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు.మండల ఉప సర్పంచ్ అధ్యక్షు లుగా పోతంగల్ గ్రామ ఉప సర్పంచ్ గులాం నబీ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.అలాగే మండల ఉపాధ్యక్షులుగా పీఎస్ ఆర్ నగర్ గ్రామ ఉప సర్పంచ్ హట్కర్ సతీష్, కార్యదర్శిగా సోంపూర్ గ్రామ ఉప సర్పంచ్ మెత్రి హౌసాజీ,కోశాధికారిగా దోమలెడ్గి గ్రామ ఉప సర్పంచ్ భీంరావు, సలహాదారులుగా సుంకిని గ్రామ ఉప సర్పంచ్ కవిత చంద్రకాంత్,జల్లాపల్లి తండా గ్రామ ఉప సర్పంచ్ గణేష్,కల్లూర్ గ్రామ ఉప సర్పంచ్ దశరథ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన మండల ఫోరం సభ్యులందరికీ తోటి ఉప సర్పంచ్ సభ్యులు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఉప సర్పంచుల సమస్యల పరిష్కారం,హక్కుల పరిరక్షణ కోసం పాటుపడతానని.గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఉప సర్పంచ్ అందరితో సమన్వయం చేసుకుంటూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన అధ్యక్షు లు గులాం నబీ అన్నారు.



# వేద విద్య ప్రవేశ పరీక్షకు విశేష స్పందన..!



- తొలి విడతలో 68 మంది విద్యార్థుల హాజరు
- త్వరలో రెండో విడత పరీక్ష



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ వేద పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి విద్యార్థుల ప్రవేశాల కోసం నిర్వహించిన తొలి విడత మౌఖిక పరీక్ష మంగళవారం విజయవంతంగా జరిగింది. పరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 98 మంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం నిర్వహించిన మౌఖిక పరీక్షకు తెలుగు మంచిర్యాల, బెల్లంపల్లి, హైదరాబాద్,నారాయణఖేడ్, కరీంనగర్, కల్వకుర్తి,పెద్దపల్లి,నిర్మల్,వికారాబాద్, కామారెడ్డి,ఆమనగల్, కొమరం భీమ్, ఆసిఫాబాద్,గిరవెల్లి,నిర్మల్, జహీరాబాద్ తో పాటు మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 68 విద్యార్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. వేద విద్యపై ఆసక్తి కలిగిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమని ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. త్వరలోనే మరో విడత మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఈ పరీక్షలు రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్య స్వామి,నందిని గిరి, పర్యవేక్షణలో జరిగింది.అన్ని వర్ణాల వారు వేద విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 8639258008, 9177259329 లేదా నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# విద్యతోనే సమాజంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం

- సహాయ పోలీసు కమిషనర్ (ట్రాఫిక్) త్రిముల్‌ఘెర్రీ డివిజన్, మల్కాజిగిరి కమిషనరేట్
- ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** విద్యతోనే సమాజంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు అన్నారు. మండల పరిధిలోని పీఎం శ్రీ జెడ్.పి.హెచ్.ఎస్ ముస్లాపూర్ పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం సన్మానించారు. ఇదే పాఠశాలలో విద్య అభ్యసించి మల్కాజిగిరి కమిషనరేట్ ట్రాఫిక్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ త్రిముల్ ఘెర్రీ డివిజన్ సహాయ పోలీసు కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్నారు. తాను చదువుకున్న ఉన్నత పాఠశాలను సందర్శించి,గత విద్యా సంవత్సరంలో జిల్లా మరియు రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.విద్యార్థుల విజయాల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థిని పూజాశ్రీ,టి.మౌనిక, కిముల్ పీయూష్,సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన రాకేష్‌తో పాటు ప్రాజెక్ట్ టాలెంట్ టెస్ట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన పూజ్యశ్రీ, నందిని, వికాస్‌లను ప్రత్యేకంగా సత్కరించారు. సందర్భంగా మాట్లాడుతూ..అభివృద్ధికి విద్యనే బలమైన పునాది అని మంచి విలువలతో కూడిన విద్య ఆర్థిక స్థితిగతులను మారుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు రాష్ట్రస్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అలాగే యువతలో పెరుగుతున్న మొబైల్ ఫోన్ వ్యసనం మరియు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొంటూ, మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని సూచించారు.రోడ్లు దాటేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని,ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైతే నిర్భయంగా ఉపాధ్యాయులు మరియు ఉన్నతాధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్. రమేష్ నాయకత్వాన్ని ప్రశంసించారు. ముఖ్యంగా డిజిటల్ తరగతి గదులు వంటి ఆధునిక వసతులు విద్యార్థుల అభ్యాసానికి ఎంతో దోహదపడుతున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్ధన్,దయానంద్,సంతోష్,గురు శరణం,యాదయ్య,తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సువర్ణావకాశం..మోమిన్ పేట్‌లో ప్రత్యేక విత్తన మేళా ప్రారంభం



- జూన్ 23 నుంచి 30 వరకు రైతు వేదికలో నిర్వహణ
- బోనస్ పొందే సన్నరకాల వరి విత్తనాలపై అవగాహన

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్‌పేట్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక విత్తన మేళా (సీడ్ మేళా)ను మంగళవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమం జూన్ 23 నుంచి జూన్ 30 వరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా కొనసాగనుంది.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందిస్తున్న సన్నరకాల వరి విత్తనాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. KNM1638, KNM7715, RNR15048, HMT సోనా, జై శ్రీరామ్, WGL44, BPT5204 వంటి సన్నరకాల వరి విత్తనాలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహక బోనస్ అందజేస్తోందని పేర్కొన్నారు.అలాగే ఈ విత్తన మేళాలో జనుములు, మొక్కజొన్న, వివిధ రకాల కూరగాయల విత్తనాలు, నానో యూరియా, నానో డి.ఎ.పీ వంటి వ్యవసాయ అవసరాల ఉత్పత్తులు రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.నాణ్యమైన విత్తనాల ఎంపిక, పంటల దిగుబడి పెంపు, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించే అంశాలపై కూడా రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని, బోనస్ పొందే సన్నరకాల వరి విత్తనాలను కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విత్తన మేళాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.




Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com